

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్ణయం జిల్లా అధికార పార్టీపై పిడుగుపాటులా పరిణమించింది. ఆయన వ్యవహారం వైసీపీని కుదిపేస్తోంది. అధికార పార్టీలో తాను ఎదుర్కొన్న అవమానాలు, మానసిక క్షోభను ఆదిమూలం వెల్లడించిన వైనం బడుగు బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అదే సమయంలో వైసీపీ అధిష్ఠానాన్ని ఆయన ధిక్కరించిన తీరు, మంత్రి పెద్దిరెడ్డిపై తిరుగుబాటు జరిపిన వైనం రాయలసీమ వ్యాప్తంగా పెద్దిరెడ్డి ప్రాబల్యాన్ని, పలుకుబడిని దెబ్బతీసింది.

వైసీపీలో దళిత ధిక్కార స్వరం

- అధికార పార్టీని కుదిపేస్తున్న ఆదిమూలం స్పందిస్తున్న తీరు
- బడుగు వర్గాలపై తీవ్ర ప్రభావం

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇంతవరకూ వైసీపీలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆ స్థాయి నేతలెవరూ అధిష్ఠానాన్ని ధిక్కరించింది లేదు. ప్రాధాన్యత ఇవ్వలేదని ఒకరిద్దరు నేతలు పార్టీని వీడినా అధిష్ఠానాన్ని విమర్శించింది గానీ, తప్పు పట్టిందిగానీ లేదు. మదనపల్లెలో సిటింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు టికెట్ నిరాకరించినా ఆయన మౌనంగానే వున్నారు. చిత్తూరులో సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు టికెట్ లేదంటూ, రాజ్యసభ టికెట్ ఆశచూపినా ఆయనా గుంభనంగా వున్నారు తప్పితే స్పందించలేదు. ఇక గూడూరు సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాద రావుకు టికెట్ గల్లంతైనా ఆయన సైతం అంతర్గతంగా కొందరిని కలవడం తప్ప ఇప్పటి వరకూ పార్టీకి వ్యతిరేకంగా పెదవి విప్పలేదు. తిరుపతి సిటింగ్ ఎంపీని సత్యవేడు అసెంబ్లీకి పోటీచేయమని ఆదేశించినా ఆయన సైతం నోరు మెదపకుండా సత్యవేడులో పర్యటనలు ప్రారంభించారు. జీడీనెల్లూరులో సిటింగ్ ఎమ్మెల్యే నారాయణస్వామికి టికెట్ లేదని, చిత్తూరు ఎంపీగా పోటీ చేయమని ఆదేశిస్తే డిప్యూటీ సీఎంగా వుండి ఎంతో సీనియర్ అయినా కూడా ఆయన తలవంచి అంగీకరించారు. చిత్తూరు ఎంపీకి సైతం టికెట్ ఇవ్వకుండా జీడీనెల్లూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమంటే ఆయన సైతం అధిష్ఠానం ఆదేశాలను మౌనంగా తలదాల్చారు. పూతలపట్టులో సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ తిరస్కరించినా మంత్రి పెద్దిరెడ్డిని నిష్ఠూరం చేసి అంతలోనే క్షమాపణలు చెప్పారు. నగరిలో మంత్రి రోజాకు టికెట్‌పై ఇప్పటి వరకూ స్పష్టమైన హామీ లేకపోయినా ఆమె కూడా ఓపికగానే నిరీక్షిస్తున్నారు. సూళ్ళూరుపేటలో సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ ఇవ్వవద్దని బలమైన వర్గం పట్టుబట్టినా అధిష్ఠానం ఖాతరు చేయకుండా ఆయనకే టికెట్ ఖరారు చేసింది. అయినా ఎమ్మెల్యేని వ్యతిరేకిస్తున్న వర్గం అధిష్ఠానాన్ని తప్పుపట్టే సాహసం చేయలేదు. పాత, కొత్త జిల్లాల్లో కుప్పం నుంచీ గూడూరు దాకా ఎలా చూసినా ఎవరూ పార్టీపై ధిక్కార స్వరం బహిరంగంగా వినిపించిన వారు గానీ, పార్టీని వీడిన వారు గానీ ఇప్పటి దాకా ఎవరూ లేరు. అలాంటిది సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వ్యవహరించిన తీరు పార్టీ నేతలకు మింగుడుపడడం లేదు. ఎమ్మెల్యే టికెట్ లేదని చెప్పినా, అంతకంటే పెద్దస్థాయిలో తిరుపతి ఎంపీగా పోటీచేసే అవకాశం దక్కినా ఆయన తృణప్రాయంగా తిరస్కరించిన తీరును పార్టీ పెద్దలు జీర్ణించుకోలేకపోతున్నారు. దానికి తోడు ఏకంగా పార్టీని వీడి టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలవడం పార్టీకి పిడుగుపాటుగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తొలి వికెట్‌ను కోల్పోవడంతో పాటు ఆయన చేసిన ఆరోపణలు పార్టీని కుదిపేస్తున్నాయి.

బలహీనపడుతున్న పెద్దిరెడ్డి ప్రాబల్యం

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎదురు దాడితో ఇంతకాలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగిన మంత్రి పెద్దిరెడ్డి ప్రాబల్యం బద్దలైంది. 2014లో పలమనేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల నుంచీ వైసీపీ తరపున పోటీ చేసిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఏవీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తర్వాత కొంత కాలం కూడా పార్టీలో వుండలేకపోయారు. అప్పట్లో వారు పార్టీని వీడడానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డే కారణమన్న ప్రచారం జరిగింది. అయినా ఆ ఇద్దరూ అప్పట్లో పెద్దిరెడ్డిపై బహిరంగ ఆరోపణలు గానీ, విమర్శలు గానీ చేయలేదు. అమర్ టీడీపీలో చేరి మంత్రిగా కూడా పనిచేయగా ప్రవీణ్ రాజకీయాలకే దూరమయ్యారు.2019 ఎన్నికల్లో పూతలపట్టు నుంచీ నాటి సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌కు టికెట్ గల్లంతు కాగా ఆయన జగన్ ఇంటి ఎదుట భోరుమని విలపించారు తప్పితే మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించలేదు. ఆ ఎన్నికల్లోనే మదనపల్లెలో సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి టికెట్ గల్లంతైనపుడు కూడా ఆయనా పెద్దిరెడ్డిపై విమర్శలు చేయలేదు. ఇప్పుడు కూడా ఉమ్మడి జిల్లాలో ఎన్ని మార్పుచేర్పులు జరిగినా బాధిత ఎమ్మెల్యేలు, ఎంపీలు మౌనంగా సహిస్తున్నారు తప్పితే పెద్దిరెడ్డి వైపు వేలెత్తి చూపే సాహసం చేయలేదు. అలాంటిది సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం నేరుగా మంత్రి పెద్దిరెడ్డిని ఉద్దేశించి అవినీతి, అక్రమాల ఆరోపణలు చేయడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. జిల్లావ్యాప్తంగా పెద్దిరెడ్డి వర్గీయులు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంపీ టికెట్ కూడా వద్దని బహిరంగంగా తిరస్కరించడం పెద్దిరెడ్డి వర్గం అహాన్ని దెబ్బతీస్తోంది. అంతకు మించి ఏకంగా పార్టీని వీడి టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలవడం, ఆ క్రమంలో పెద్దిరెడ్డికి హెచ్చరికలు చేయడంతో మంత్రి ప్రాబల్యం దారుణంగా దెబ్బతిన్నట్టవుతోంది. పెద్దిరెడ్డిని వ్యతిరేకించే వైసీపీ వర్గాలు ఆదిమూలం ధైర్యానికి, తెగింపుకు లోలోన సంబరపడుతుండడం గమనార్హం. ఇంతకాలం ఇతర మంత్రుల నియోజకవర్గాల్లో కూడా జోక్యం చేసుకుని వారికి నిద్రాహారాలు కరువు చేసిన వైనం తలచుకుంటున్న వ్యతిరేక వర్గీయులు ఇపుడు ఓ దళిత ఎమ్మెల్యే మూలంగా తగిన మూల్యం చెల్లించుకుంటున్నారని సంబరపడుతున్నారు.

బడుగు వర్గాలపై తీవ్ర ప్రభావం

కారణాలు ఏవైనప్పటికీ జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ దళిత సామాజికవర్గాల్లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి హీరో వర్షిప్ వచ్చినట్టవుతోంది. రాష్ట్రంలో పలుచోట్ల ఇతర సామాజికవర్గాలు వైసీపీ అధిష్ఠానంపై తిరుగుబాటు చేసిన ఉదంతాలున్నా దళిత వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచీ ఆ పరిస్థితి ఎదురుకాలేదు.అలాంటి పరిస్థితుల్లో ఆదిమూలం ఎగరేసిన తిరుగుబాటు బావుటా ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగు వర్గాల్లో విపరీతమైన చర్చకు దారి తీస్తోంది. ఎమ్మెల్యే టికెట్ నిరాకరించినా అంతకు మించిన ఎంపీ టికెట్ ఆఫర్ చేసినా ఆదిమూలం తిరస్కరించిన తీరు, తనకు పదవి, అధికారం కంటే ఆత్మగౌరవం ముఖ్యమని ప్రకటించిన వైనం అట్టడుగు సామాజికవర్గాలను కదిలిస్తోంది. తాను తప్పేమీ చేయకుండానే తనకు ఎమ్మెల్యే టికెట్ నిరాకరించడం పట్ల ఆయన తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.దీన్ని ఇతరుల్లా దాచుకోకుండా బహిరంగపర్చడం ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాలకు దళిత ఎమ్మెల్యేలు పడుతున్న క్షోభ తెలిసివస్తోంది.ఎస్సీ ఎమ్మెల్యేలను, ఎంపీలను టికెట్ల పేరిట తీవ్రంగా వేధిస్తున్న విషయం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలు స్థానాల్లో నిరూపితమైన నేపథ్యంలో ఆయా సామాజికవర్గాల్లో అధికార పార్టీ పట్ల తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. దానికి ఆదిమూలం తెగువ ఆజ్యం పోసినట్టయింది. ఈ పరిణామాలు అంతిమంగా ఎన్నికల్లో అధికార పార్టీకి తీవ్ర నష్టం కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తిరుమలలో పెరిగిపోతున్న వరాహాల సంచారం

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో రోజురోజుకూ శునకాలతోపాటు వరాహాల (పందులు) సంచారం పెరిగిపోతోంది. జనసంచారంలో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కొద్దిరోజుల ముందు వరకు కాటేజీలు, రోడ్లు, హోటళ్ల ముందు మాత్రమే కనిపించేవి, ఇప్పుడు ఏకంగా ఆలయం సమీపానికే వచ్చేస్తున్నాయి. తాజాగా మంగళవారం వేకువజామున రెండు వరాహాలు ఆలయ సమీపంలో భక్తుల మధ్యే తిరిగాయి. అయినా సిబ్బంది పట్టించుకోక పోవడం గమనార్హం.



- అమెరికాలో ఈబీ-1 వీసీ పొందిన తిరుపతి యువకుడు
- యాపిల్ కంపెనీ రీసెర్చ్ సైంటిస్ట్‌గా రూ. 5.3 కోట్ల వార్షిక వేతనం

అగ్రరాజ్యంలో మెరిసిన అనంత రవి తేజం

తిరుపతి రూరల్, జనవరి 30: అగ్ర రాజ్యం అమెరికాలో అనంత రవితేజ అనే తెలుగు యువకుడు మెరిశాడు. తిరుపతికి చెందిన ఇతను ఈబీ-1 వీసా (ఐన్‌స్టీన్ వీసా) పొందాడు. అసాధారణ ప్రతిభను చూపిన వ్యక్తులకు మాత్రమే ఇలాంటి గుర్తింపు లభించడం గమనార్హం. దీనిపై తిరుపతి నలంద నగర్‌లో ఉంటున్న ఈయన తల్లిదండ్రులు నీలిమ, రమేష్ నాయుడితోపాటు నగరవాసులూ హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడికి ఈబీ-1 వీసా రావడం సంతోషంగా ఉందన్నారు. తమ స్వగ్రామం చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లె అని తెలిపారు.

ప్రస్థానమిలా..

తిరుపతి బాలాజీ కాలనీలోని కేంబ్రిడ్జ్ స్కూల్లో రవితేజ ప్రాథమిక విద్యాభ్యాసం, బెంగళూరులో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, న్యూయార్క్ యూనివర్సిటీలో ఎంఎస్, హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. తొలుత అమెరికాలో బ్లూబర్గ్ కంపెనీలో రీసెర్చ్ ఇంజనీర్‌గా ఏడాదిపాటు పనిచేశారు. వాషింగ్టన్ స్టేట్‌లో ఉన్న యాపిల్ కంపెనీలో పలు స్థాయిల్లో పనిచేసి, రూ.5.3 కోట్ల వార్షిక వేతనంతో ఏడాది కిందట ప్రిన్సిపల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పదోన్నతి పొందాడు. ఈక్రమంలో రవితేజకు ఈబీ-1వీసా మంజూరు చేయాలన్న యాపిల్ కంపెనీ చేసిన విన్నపాన్ని అమెరికన్ ప్రభుత్వం ఆమోదించింది. ఈబీ-1 వీసీ ద్వారానే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అమెరికాలో అడుగు పెట్టారు. అమెరికన్ జర్నల్స్‌కు పదబంధాల(క్రాస్ వర్డ్స్)ను రూపొందించిన ముంబై వాసి మంగేష్ గోగ్రేకు కూడా ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈబీ-1 వీసాను ప్రకటించిన విషయం తెలిసిందే.

జీవన ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేస్తా



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి లోతైన పరిశోధన చేయాలని ఉంది. దీనిద్వారా అన్ని రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా జీవన ప్రమాణాల పెంపొందించేందుకు కృషి చేస్తా. ఇందుకోసం స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి.. తద్వారా ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని భావిస్తున్నా.

- అనంత రవి తేజ



యాపిల్ కంపెనీ సీఈవో టిమ్ కుక్‌తో..

సర్పంచులకు నిధులు, విధులు ఇవ్వకుంటే గద్దె దింపుతాం

- వైసీపీ ప్రభుత్వానికి పంచాయతీరాజ్ చాంబర్ హెచ్చరిక

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 30: సర్పంచులకు నిధులు, విధులు ఇవ్వకుంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య హెచ్చరించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపుతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సింగంశెట్టి మాట్లాడుతూ.. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,639.79కోట్లను నవరత్నాల పథకాలకు సీఎం జగన్ దారి మళ్లించారని ఆరోపించారు. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక సర్పంచులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇంకొన్ని చోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పిలిస్తే ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అప్పులు చేసి సర్పంచులే పనులు చేశారన్నారు. వారికి కూడా బిల్లులు చెల్లించకుండా అప్పుల పాలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే చలో విజయవాడకు పిలుపునిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా సర్పంచులు మహేష్, శివకుమార్, లక్ష్మీప్రసన్న, లక్ష్మీదేవి, రెడ్డెప్పనాయుడు, శశికళ, రమణ, వెంకటరమణ, సురేష్, చాంబర్ సభ్యులు రాము, జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో ప్రసంగిస్తున్న సింగంశెట్టి సుబ్బరామయ్య

రిజిస్ట్రేషన్లకు చివరి వేలిముద్ర లేదిక

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో క్రయ విక్రయదారుల నుంచి చివరి వేలిముద్ర స్వీకరణకు ప్రభుత్వం మంగళం పాడింది.సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు క్రయవిక్రయదారుల ఫొటోలు, వారి ఆధార్‌కార్డు నెంబర్లతో దస్తావేజు తయారవుతుంది. ఈకేవైసీ చేశాక క్రయవిక్రయదారులు వేలిముద్రలు వేస్తారు.దానిపై సబ్‌రిజిస్ట్రార్ ఈ-సైన్ చేస్తారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలో క్రయవిక్రయదారులు చివరిసారిగా వేలిముద్రలు వేస్తారు. దస్తావేజులు నిబంధనల మేర ఉన్నాయంటూ సబ్‌రిజిస్ట్రార్ సంతృప్తి పొంది ఈ-సైన్ చేయడంతో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. అయితే తొలిసారి వేసిన వేలిముద్రే సరిపోతుందని తాజాగా చట్ట సవరణ జరిగింది.

ఏడు పాఠశాలలకు 'హరిత' అవార్డులు





అవార్డు అందుకున్న టీచర్లు - అవార్డు అందుకుంటున్న నీలకంఠయ్య

- జాతీయస్థాయి అవార్డు అందుకున్న నీలకంఠయ్య

తిరుపతి(విద్య), జనవరి 30: న్యూఢిల్లీలోని ఇండియన్ హాబిటేట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రీన్ కార్నివాల్ ప్రోగ్రామ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉత్తమ హరిత పాఠశాలలుగా ఎంపికైన ఏడు స్కూల్స్‌కి సంబంధించిన గ్రీన్ టీచర్లు అవార్డులు, ధ్రువపత్రాలను అందుకున్నారు. ఈమేరకు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్‌ఈ) డైరెక్టర్ సునీత అగర్వాల్ చేతులమీదుగా ఈ అవార్డులు అందుకున్నట్లు ఒకప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జాతీయ స్థాయిలో గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో రాష్ట్రం తరపున ఉత్తమ ప్రదర్శన చేసిన ఎన్జీసీ స్టేట్ కో-ఆర్డినేటర్, కరకంబాడి జడ్పీహెచ్‌ఎస్ బయాలజీ టీచర్ పి.నీలకంఠయ్య జాతీయస్థాయి అవార్డు అందుకున్నట్లు ప్రకటించారు. కాగా.. రాష్ట్రంలోని 6,500పాఠశాలల్లో ఎకో క్లబ్స్ ఉన్నాయని, ఈఏడాది నుంచి ప్రైమరీ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఎన్జీసీ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి తెలిపారు.



ఏనుగులు విరిచేసిన చెట్లు

గ్రామాల్లో గజరాజుల విధ్వంసం

చంద్రగిరి, జనవరి 30: చంద్రగిరి మండలంలోని చిన్నరామాపురం, శేషాపురం గ్రామాల సమీపంలో సోమవారం రాత్రి ఏనుగులు పంట పొలాలను ధ్వంసం చేశాయి. సుమారు 13 ఏనుగుల గుంపు శేషాపురంలోని సంపూర్ణమ్మకు చెందిన పశువుల మేతకోసం సాగుచేసిన గడ్డిని తినేశాయి. నాగేశ్వరరావు పొలంలో ని గడ్డిని సైతం తొక్కేశాయి. చంద్రకేశవులకు చెందిన పొలంలో 14 మామిడి చెట్లు, 15 అరటి చెట్లు, ఎకరా జొన్నగడ్డి, ఎకరా పచ్చ గడ్డిని తొక్కి, తిని నాశనం చేశాయి. చిన్నరామాపురంలోని షాజహాన్‌కు సంబంధించిన రెండు ఎకరాల్లోని కొబ్బరి, అరటి, మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. పొలాలకు ఉన్న ఫెన్సింగ్‌ను కూల్చేశాయి. సాగునీటి, డ్రిప్ పైపలను విరిచేశాయి. అధికారులు స్పందించి నష్టపరి హారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అమ్మవారి ఆలయానికి తిరుచ్చి పీట, మకర తోరణం కానుక



తిరుచానూరు, జనవరి 30: తిరుచానూరు పద్మావతి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు రూ.65లక్షలు విలువ చేసే బంగారు తాపడంతో తయారు చేసిన తిరుచ్చి పీట, మకరతోరణం మంగళవారం ఆలయ అధికారులకు అందజేశారు. అలాగే తిరుచ్చి ఉత్సవానికి తండ్లు అందజేశారు.

బీసీ గర్జనకు సర్వం సిద్ధం

ఎర్రావారిపాళెం, జనవరి 30: ఎర్రావారిపాళెంలో బుధవారం జరగనున్న టీడీపీ బీసీ గర్జన మహాసభకు సర్వం సిద్ధమైంది. సంతగేటుకు ఎదురుగా ఉన్న బేరిపల్లె రోడ్డుకు అనుకొని ఉన్న ఐదెకరాల మైదానంలో సభకు పార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే సభ నిర్వాహణకు పోలీసుల అనుమతి పొందారు. బస్టాండ్ కూడలి నుంచి సభ వేదిక వరకు టీడీపీ, జనసేన జెండాలు నిండిపోయాయి. 5వేల మందికి ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లలో టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నా సముద్రం మధుసూదన్, ఎర్రావారిపాళెం మండల అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ, చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షులు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మహేష్‌నాయుడు, మదన్‌మోహన్, కృష్ణమూర్తి, హరిశ్చంద్ర, ఓబిలి విశ్వనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మౌలాలి, సహదేవరెడ్డి, మురళి, లక్ష్మీదేవి, దేవి, కేశవుల నాయుడు, వెంకటశివరామిరెడ్డి, దేశిరెడ్డి శేషనాయుడు, ప్రసాద్ నాయుడు, మురళి నాయుడు, గోపి, శ్రీనివాసులు, వెంకట్రామయ్య పనులు పర్యవేక్షిస్తున్నారు.

సంక్షేమ బోర్డుల ఆవిష్కరణ

పాకాల, జనవరి 30: దామలచెరువు, పుదిపట్ల బైలు, వల్లివేడు, రవణయ్యగారిపల్లెలలో వైసీపీ జెండాలను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆయన అయా గ్రామాలలో సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన బోర్డులను ఆవిష్కరించారు.

నానీకి ఒక్క అవకాశం ఇవ్వండి

పాకాల, జనవరి 30: వచ్చే ఎన్నికల్లో పులివర్తి నానీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి సుధారెడ్డి కోరారు. మండలంలోని దామలచెరువులో మంగళవారం 'మీ ఇంటివద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ అమలు చేయబోయే సంక్షేమ పథకాలు వివరించారు.

బీజేపీని ఆదరించండి



పాకాల రైల్వే స్టేషన్‌లో మాట్లాడుతున్న పురుషోత్తం నాయుడు

పాకాల, జనవరి 30: చంద్రగిరి అభివృద్ధి కోసం బీజేపీని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు కోరారు. మంగళవారం ఆయన పాకాల రైల్వే స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో పాకాల రైల్వే స్టేషన్ అభివృద్ధికి 5.76కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో స్టేషన్ సుందరీకరణ పనులు జరిగి ప్రమాణికులకు మెరుగైన సైకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. పాకాల ముఖద్వారం వద్ద వున్న రైల్వే గేటువద్ద ఓవర్ బ్రిడ్జి లేదా అండర్ పాస్ నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటాద్రినాయుడు, నరేంద్ర, గౌతమి, ప్రభాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా నగదు పంపిణీ


ఎర్రావారిపాళెం, జనవరి 30: మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం బుధవారం జరగనుంది. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఆసరా చెక్కును అందించనున్నారు.

ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు!



పోలింగ్ స్టేషన్ 101లో వున్న మృతిచెందిన వారి పేర్లు

పాకాల, జనవరి 30: సవరణలు చేపట్టి తుది ఓటర్ల జాబితా ప్రకటించినా మృతిచెందిన వారికి ఓటు హక్కు మండలంలో అలాగే వుంది. ఒక్కో పోలింగ్ కేంద్రంలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్ 101లో మునెమ్మ (ఐఎక్స్ 2526762), దొరస్వామి (ఐఎక్స్ 25699), మృతిచెందినా జాబితాలో ఓటర్లుగా సజీవులుగానే ఉన్నారు. పోలింగ్ కేంద్రం 89పాకాల చాకలి వీధి, భారతంమిట్ట, ధర్మరాజుల గుడి వీధి, బందెలదొడ్డి వీధి పరిధిలో డి.శ్రీనివాసులు (ఐఎక్స్ 0012302), పి.లక్ష్మమ్మ (ఐఎక్స్ 2489672), మంజుల (ఐఎక్స్ 2981355), మృతిచెందినా తాజా జాబితాలో పేర్లు అలాగే వున్నాయి. ఎన్.రాజేశ్వరి (బిడీజీ 2282119) ఈ కేంద్రంలోనూ గానుగపెంట పోలింగ్ కేంద్రం 82లోనూ ఓటు హక్కు కలిగి వుంది. భారతంమిట్టకు చెందిన ఎ.రమణి (ఐఎక్స్ 0629162) కి పూతలపట్టు మండలం పోలింగ్ బూత్ 49లోనూ ఓటు ఉంది. సీరియల్ నెం.609 రతన్ రెడ్డి తెలంగాణా వాసి అయినా జాబితాలో అలాగే వుంది. పోలింగ్ స్టేషన్ 100 చెన్నుగారిపల్లె, బార్లీకొండ బంగ్లా, యనమనాయనపల్లె పరిధిలో చొక్కలింగం (ఐఎక్స్ 2624981), దొరస్వామిమందడి (ఐఎక్స్ 2525129), ఆనందయ్య (ఐఎక్స్ 2527059), వెంకటయ్య (ఐఎక్స్ 2527127), మాధవనాయుడు (బిడిజి 2314318)లు మృతిచెందినా జాబితాలో అలాగే ఉంచారు. పూతలపట్టు మండ లానికి చెందిన మొబీనా (వలంటీరు)ఐఎక్స్ 3402047 ఈ కేంద్రంలోనూ ఓటు వుంది. పోలింగ్ స్టేషన్ నెంబరు 62లో నాలుగు డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్ 90లో ఎస్. చంద్ర మోహన్ (ఐఎక్స్ 0733857), శేషమ్మ(ఐఎక్స్ 2490605)లు మృతిచెందినా జాబితాలో తొలగించలేదు. పోలింగ్ స్టేషన్ 80లో సుమారు 10 దొంగ ఓట్లు నమోదు అయ్యాయి. పోలింగ్ స్టేషన్ 84లో డబుల్ ఎంట్రీలు, మృతిచె ందిన వారు 10 మందికి పైగా ఉన్నారు. 92లో నాలుగు డబుల్ ఎంట్రీలు, ఇద్దరు మృతుల పేర్లు ఉన్నాయి. పోలింగ్‌స్టేషన్ 91లో మృతిచెందిన ముగ్గురి పేర్లు, షిఫ్టింగ్ 7, 6 డబుల్ ఎంట్రీలు జాబితాలో అలానే ఉన్నాయి. మండలంలోని 54 పోలింగ్ కేంద్రం పరిధిలో తాజాగా ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో పలు అవకతవకలు, తప్పులు సవరించాల్సి ఉంది.



పోలింగ్ స్టేషన్ 89 ఓటర్ జాబితాలో వున్న మృతిచెందిన వారి పేర్లు

క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్ర

చంద్రగిరి, జనవరి 30: గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం, ఆంధ్రా కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం.. ఆంధ్రా ముగింపు కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎంపీపీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీనాయక్, ఏవో రవిచంద్ర, పీడీ పూర్ణశరత్‌చంద్ర, మదన్ మోహన్,నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత స్థలాల్లో పోస్టర్లు పెట్టుకోవడానికి అనుమతించండి: టీడీపీ



ఎంపీడీవోతో మాట్లాడుతున్న పులివర్తి నాని, ఈశ్వర్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, జనవరి 30: టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారి సొంత స్థలాల్లో సొంత ఖర్చులతో స్వచ్ఛందంగా పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లు పెట్టుకోవడానికి అనుమతించాలని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, తిరుపతి రూరల్ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు తిరుపతి రూరల్ ఎంపీడీవో రమేష్‌బాబును మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు నిబంధనల ప్రకారం అన్ని పార్టీలకు సమన్యాయం పాటించాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రజలకు ఎలాంటి అవరోధం లేకుండా ఏమైనా బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేస్తే నిబంధనల ప్రకారం రుసుం వసూలుకు నోటీసు ఇవ్వాలన్నారు. వీటికి నిర్ణయించిన రుసుం చెల్లించగలమని చెప్పారు. అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి అత్యుత్సాహం ప్రదర్శిస్తే తాము ప్రత్యక్ష ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు తమకు నచ్చిన విధంగా ప్రచారం చేపట్టడాన్ని అడ్డుకునే వీలు లేదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిరుదాల భాస్కరరెడ్డి, మధు, శ్రీధర్‌నాయుడు, శ్రీనివాసులు, వెంకటేష్, ఈశ్వరయ్య, గోపి, కిషోర్‌రెడ్డి, మధుశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవిడ్ కాలంలో వైద్యుల సేవలు మరువలేనివి: ఎమ్మెల్సీ



సమావేశంలో ప్రసంగిస్తున్న సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి సిటీ, జనవరి 30: కొవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యుల సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా రుయాస్పత్రిలోని లెక్చరర్ గ్యాలరీలో మంగళవారం కొవిడ్ సేవల్లో మృతిచెందిన వైద్యులను స్మరించుకుంటూ ఐఎంఏ ఆధ్వర్యంలో కొవిడ్ అమర వైద్యుల దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా సేవలు అందించిన వైద్యులకు పద్మశ్రీ అవార్డులు అందించేందుకు ప్రభుత్వానికి ఐఎంఏ సిఫార్సు చేయాలన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ.. కొవిడ్ బారి నుంచి ప్రజల ప్రాణాలను రక్షించే క్రమంలో జిల్లా పరిధిలో 11 మంది వైద్యులు అమరులయ్యారని చెప్పారు. వారి కుటుంబీకులకు అండగా నిలవాలని కోరారు. అలాగే పారామెడికల్ సిబ్బంది కూడా కొవిడ్ కాలంలో మెరుగైన సేవలందించారని కొనియాడారు. అనంతరం కొవిడ్ కాలంలో సేవలందించిన వైద్యులను సన్మానించారు. ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరిరావు, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, పల్మనాలజీ విభాగాధిపతి, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండ్ డాక్టర్ పార్థసారధిరెడ్డి, డాక్టర్ సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణసులోచనదేవి తదితరులు పాల్గొన్నారు.

హోదాపై మోదీ నమ్మక ద్రోహానికి పదేళ్లు: ఆప్



నిరసన దీక్షలో నగేష్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30: రాష్ట్రానికి ప్రత్యేక ఇస్తామని మోదీ ఎన్నికల హామీ ఇచ్చి నమ్మక ద్రోహానికి పాల్పడి పదేళ్లు అయ్యిందని ఆమ్ ఆద్మీ (ఆప్) జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద ఆమ్ ఆద్మీ శ్రేణులు ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టాయి. నగేష్ మాట్లాడుతూ.. ప్రధాని రాష్ట్రానికి హోదా ఇస్తానని చెప్పి మరిస్తే, రాష్ట్రంలోని బీజేపీ నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సీఎం జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు మాట్లాడక పోవడం సరికాదన్నారు. నాయకులు కల్లూరు బాలసుబ్రమణ్యం, కోడివాక చందు, కందనూరు జగదీష్, బొంతల రాజేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. తొలుత రిలే నిరాహార దీక్ష చేపట్టాలని భావించారు. దీనికి పోలీసులు అనుమతించక పోవడంతో నిరసన దీక్షలు చేపట్టారు.

సనాతన ధర్మాన్ని నాశనం చేయాలనుకునే వాళ్లే నాశనమయ్యారు

● బీజేపీ ఎంపీ లక్ష్మణ్



తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని ఔరంగజేబు మొదలుకుని పలువురు రాజకీయ నాయకులు, సంస్థలు.. మందిరాలను ధ్వంసం చేశారు. కానీ ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని తొలగించలేకపోయారు. సనాతన ధర్మాన్ని నాశనం చేయాలనుకునే వాళ్లే నాశనమయ్యారు. సనాతన ధర్మం మాత్రం దేదీప్యమానంగా వెలుగుతోంది' అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ధర్మ వ్యాప్తి కోసం ఇంకా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణమైన క్రమంలో భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా మరిన్ని ఆలయాలు వెలుగులోకి రావాలన్నారు. పూర్వీకులు మనకు ఇచ్చిన వారసత్వ సంపదను తిరిగి పొందాలనే ఆసక్తి అందరిలో వ్యక్తమవుతోందన్నారు. ఖచ్చితంగా భగవంతుడి ఆశీస్సులతో భక్తుల కోరికలు నెరవేరుతాయన్నారు. తిరుమల తరహాలో అయోధ్య కూడా ప్రపంచంలోనే గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రధాని మోదీ, సీఎం యోగిఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో విరాజిల్లుతుందన్నారు.

16న తిరుమలలో రథసప్తమి వేడుక

● ఒకే రోజు ఏడు వాహనాలపై దర్శనమివ్వనున్న శ్రీవారు

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా ఫిబ్రవరి 16వ తేదీన తిరుమలలో రథసప్తమి పర్వదినం జరగనుంది. ఈ సందర్భంగా ఏడు వాహనాలపై శ్రీవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. పవిత్రమైన మాఘ మాసంలో శుక్ల పక్ష సప్తమి తిథిని రథసప్తమి లేదా మాఘ సప్తమి అని పిలుస్తారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార, ఊంజల్ సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనున్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, సంజీవ్‌కుమార్, ప్రభుత్వ విప్ కోరుముట్ల శ్రీనివాసులు, మంగలి కృష్ణ, తెలంగాణ ఎంపీ మాలోత్ కవిత, తిరుపతి మున్సిపల్ నూతన కమిషనర్ అదితి సింగ్, తెలంగాణ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే అష్టదళపాదపద్మారాధన సేవలో తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

■ ఇవేం కష్టాలు గోవిందా!











అలిపిరి గరుడ కూడలిలో ఓ సినిమా షూటింగ్ మంగళవారం జరగడంతో శ్రీవారి భక్తులు ఇబ్బందులు పడ్డారు. దర్శనానికి వస్తే కొండ కింద ఇవేం కష్టాలు గోవిందా.. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నడూలేనన్ని అభివృద్ధి పనులు చేపట్టాం : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

చంద్రగిరి, జనవరి 30: గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి పనులు మండలంలో చేపట్టామని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు రూ.150 కోట్ల వ్యయంతో అభి వృద్ధి పనులు చేపట్టామన్నారు. అన్నిశాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అమృత, ఎంపీడీవో బాలాజీనాయక్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పలువురికి పులివర్తి నాని పరామర్శ



చిన్నబ్బ నాయుడిని పరామర్శిస్తున్న నాని

చంద్రగిరి, జనవరి 30: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని సోమవారం పలువురుని పరామర్శించారు. నారావారిపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న నారా చిన్నబ్బనాయుడిని పరామర్శించారు. అదేవిధంగా కొటాల గ్రామంలో కొమ్మినేని రామ్మోహన్‌నాయుడు సోమవారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు.. దీంతో నాని కొటాలకు చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నరసింగాపురంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

చంద్రగిరి, జనవరి 30: చంద్రగిరి మండలంలోని నరసింగాపురం పంచాయతీలో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం



పార్థసారథి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చంద్రగిరి, జనవరి 30: చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాయామ ఉపాధ్యాయుడు పార్థసారథి దంపతులను చంద్రగిరి నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాకాల మండలం దామలచెరువు ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా పార్థసారథి పనిచేస్తూ పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొందు సుబ్రమణ్యంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, మదన్‌మోహన్, మునిశేఖర్, రామకృష్ణ, పళణి, జ్యోతి, శకుంతల, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

బీఐవో ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

తిరుపతి సిటీ, జనవరి 30: క్యాన్సర్ నివారణలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(బీఐవో) ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్విమ్స్‌లోని పద్మావతి ఆడిటోరియంలో బీఐవో, కమ్యూనిటీ మెడిసిన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ)లకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ రోగులను తొలిదశలోనే గుర్తించే బాధ్యతలను ఎంఎల్‌హెచ్‌పీలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ.. శిక్షణకు జిల్లా నుంచి 90 మంది మెడికల్ ఆఫీసర్లు, 440 మంది సీహెచ్‌వోలు, 25 మంది ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొంటారని తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, డీపీఎంవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణ సులోచనదేవి, డీఎస్‌వో తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌గా అమరయ్య




మేయర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న అమరయ్య

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా అమరయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీసీగా పనిచేస్తున్న చంద్రమౌళీశ్వర్ రెడ్డి ఇటీవల మంగళగిరి మెప్మా కార్యాలయానికి బదిలీపై వెళ్లగా, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వీసీగా పనిచేస్తున్న అమరయ్య ఇక్కడికొచ్చారు. బాధ్యతలు స్వీకరించాక ఆయన మేయర్ శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు.

2న జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30: ఎస్వీయూలో ఫిబ్రవరి 2వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో మేళా ఆరంభం కానుంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు అర్హులు. సమగ్ర వివరాలకు 7989810194 నెంబరులో సంప్రదించాలని వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉడ్‌సైడ్ హోటల్ అధినేత మృతి



క్రిష్ణభట్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(కొర్లగుంట), జనవరి 30: ప్రముఖ ఉడ్‌సైడ్ హోటల్ అధినేత క్రిష్ణభట్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం వేకువ జామున మృతి చెందారు. దాదాపు 30ఏళ్లపాటు తిరుమల వ్యాపార సంఘంలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్నారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. వ్యాపార రంగంలో అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదిగి.. మూడు దశాబ్దాలుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



తిరుపతి(కొర్లగుంట), జనవరి 30: గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు చైర్మన్ డాక్టర్ పి.సి. రాయలు ఆధ్వర్యంలో నిరుపేదలకు బ్లౌజులు, చీరలు, పంచెలు పంపిణీ చేశారు. కరకంబాడిరోడ్డు తిమ్మనాయుడుపాళెం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా గాంధీస్మృతి మాజీ డైరెక్టర్ డాక్టర్ సవితాసింగ్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్‌కు రూ.1.16లక్షలు విరాళంగా అందజేశారు. ట్రస్టు డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, అనిల్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, మంజుఅగర్వాల్, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉమాపతి, బండిమధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

107మంది విద్యార్థినులకు ఆర్థిక సాయం



తిరుపతి(కొర్లగుంట), జనవరి 30: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో 107మంది నిరుపేద విద్యార్థినులకు ఆర్థికసాయం చేశారు. సామాజిక సేవలో భాగంగా ఏటా ఉమ్మడి జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పేదరికం, 10వ తరగతి మార్కుల ఆధారంగా ఆర్థికసాయం అందించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను 107మందిని ఎంపిక చేశారు. వీరిని మంగళవారం తిరుపతి మలబార్ బంగారు ఆభరణాల ప్రదర్శనశాలకు తీసుకొచ్చారు. మేయర్ శిరీష ద్వారా రూ.8వేల నుంచి రూ.10వేల వరకు మొత్తం రూ.9.72లక్షలు అందించారు. తిరుపతి జోనల్ హెడ్ నిఖిల్‌చంద్రన్, షోరూం హెడ్ రిజీష్ మాట్లాడుతూ.. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థకు లభించే ఆదాయంలో ఐదు శాతం సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నామని చెప్పారు.

తిరుమలలో షికారీల ఘర్షణ : ఒకరికి గాయాలు



దాడి చేసిన గాంధీ - గాయపడిన రాజేష్

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం ఇద్దరు షికారీలు ఘర్షణ పడ్డారు. ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలోని ఓటేరుకు చెందిన షికారీలు గాంధీ, రాజేష్‌లు తిరుమలలో పూసలు, దిష్టికాయల వ్యాపారం చేస్తున్నారు. వ్యాపార విషయంలో ఇద్దరి మధ్యా మంగళవారం సాయంత్రం వివాదం తలెత్తి, ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో గాంధీ తన వద్ద ఉన్న కత్తితో రాజేష్‌పై దాడి చేయడంతో అతను గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులోనే ఇద్దరూ ఘర్షణకు దిగినట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు నీటిశుద్ధి యంత్రం వితరణ



తిరుపతి(ఆటోనగర్), జనవరి 30: భవానీ నగర్‌లో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు వాకర్స్ సంఘం నాయకులు రూ.16వేల విలువైన నీటిశుద్ధి యంత్రాన్ని మంగళవారం వితరణ చేశారు. నాయకులు డాక్టర్ దేవరాజులు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రభాకర్, రవీంద్రారెడ్డి, కే.వి.రమణయ్య, వెంకటరమణారెడ్డి, సత్య, చంద్రశేఖర్‌రెడ్డి, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.79 కోట్లు

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.79 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 71,082 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,912 మంది తలనీలాలు సమర్పించారు.

మాధవరం నుంచి తమిళనాడు దక్షిణ నగరాలకు ఆర్టీసీ సర్వీసులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 30: తమిళనాడులోని దక్షిణ నగరాలకు ఇకపై మాధవరం బస్టాండు నుంచి కూడా ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. గతంలో కోయంబేడు బస్టాండుకెళ్లి ప్రయాణికులు బస్సులు ఎక్కాల్సి రావడంతో ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మాధవరం నుంచి కూడా బస్సులు నడిపేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారనే
చంద్రబాబుపై అక్రమ కేసులు : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 30: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారనే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి, రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు పెట్టి వేధించారని చెప్పారు. నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో నివేదిక ప్రకారం ఏపీలో మహిళలపై నేరాలు 43శాతం పెరిగాయన్నారు. పంటలకు సాగునీ రందక, చేసిన అప్పు తీరక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. చలనంలేని ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైనాట్ 175 అనే సీఎం.. మొన్న తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓడిపోయినా తప్పులేదని, తన ఓటమిని ఇప్పటికే ఒప్పుకున్నారని తెలిపారు. రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో వైసీపీకి వత్తాసు పలికిన అధికారులపై విచారణ చేపట్టి.. సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్నాథం, సింగంశెట్టి, మధుసూదన్‌యాదవ్, మనోహర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు



మీడియాతో మాట్లాడుతున్న ఆర్సీ మునికృష్ణ

'తమ అధినేతపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగు రోడ్డు కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఇది జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టు వంటిది. దీనిపై తెలుగు ప్రజలు హర్షిస్తున్నారు' అని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, పార్లమెంటు అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు తెలిపారు. వారు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసు పెడుతూ ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహించారు. ఇప్పటికే వైసీపీ నుంచి రోజుకు ఒకరు బయటకు వచ్చేస్తున్నారని, టీడీపీ గేట్లు తెరిస్తే ఆ పార్టీ ఉండదని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులు ఆర్సీ శ్రీనివాసులు, శ్రీధర్, జగన్నాథం, వెంకటరెడ్డి, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అటవీ కార్మికుల దీక్షలు కొనసాగిద్దాం : వామపక్షాలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 30: సమస్యలు పరిష్కారమయ్యే వరకు టీటీడీ అటవీ కార్మికుల దీక్షలు కొనసాగించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు నిర్ణయించారు. కార్మికుల నిరవధిక దీక్షలను సోమవారం రాత్రి పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. దీన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన రౌంట్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. టీటీడీ యాజమాన్యం చర్చలకు పిలిచి.. అర్ధరాత్రి దీక్షలో ఉన్నవారిని అరెస్టు చేయించడం ఏంటని ప్రశ్నించారు. బోర్డు తీర్మానం, హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా ఈవో ధర్మారెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం నుంచి మరో ప్రసాద్, కృష్ణమూర్తి, మహేష్, మునిక్రిష్ణయ్య, చలపతి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు దీక్ష కొనసాగిస్తున్నారని చెప్పారు. ఎంతమందిని అరెస్టు చేసినా దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్పీఐ అధ్యక్షుడు పి.అంజయ్య, ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పొత్తూరి రెడ్డెప్పనాయుడు, సీఐటీయూ జిల్లా నాయకులు చైతన్య, సురేంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్ ప్రసంగించారు. వేణుగోపాల్, శ్రీను, మునిరాజ, ఈ.ఎస్.కుమార్, ఆర్.లక్ష్మి, పి.బుజ్జి, చిన్నా, వాసు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు చేయండి: టీటీడీ ఈవో



అధికారులతో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఆస్థాన మండపంలో ఫిబ్రవరి మూడు నుంచి ఐదో తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సనాతన ధార్మిక సదస్సుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలని ఈవో ధర్మారెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు సదస్సుకు వస్తారన్నారు. వీరికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇందుకోసం ముగ్గురు సీనియర్ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులను సంప్రదించాలన్నారు. అలాగే ప్రతి స్వామీజీకి ఓ లైజన్ అధికారిని నియమించాలన్నారు. అలాగే టీటీడీ నిర్వహించే ధర్మప్రచార కార్యక్రమాలపై ఎస్వీబీసీ వీడియో రూపొందించాలని సూచించారు. జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, వేద విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాణిసదాశివమూర్తి, డీపీపీ కార్యదర్శి సోమయాజులు, ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు : ఆర్ఐవో



మాట్లాడుతున్న ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, పక్కనే డీఈసీ సభ్యులు

తిరుపతి(విద్య), జనవరి 30: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో జీవీ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీజూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్, హైస్కూల్స్ ప్లస్ హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20 తేదీవరకు మూడు స్పెల్స్‌లో, జనరల్ కోర్సులకు అదేనెల 11నుంచి 20వ తేదీవరకు రెండు స్పెల్స్‌లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. 138 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 22,454మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయని చెప్పారు. ప్రత్యేక అధికారి విశ్వనాథనాయక్, డీఈసీ సభ్యులు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, ఎ.రఘుపతి, తులసీ రామిరెడ్డి, వి.బాబుపాల్గొన్నారు.

2న ఎథిక్స్, 3న పర్యావరణ విద్య పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయి. ఈపరీక్షలకు విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఈపరీక్ష పాసైతేనే ఇంటర్ ఉత్తీర్ణులైనట్లు పెద్ద మార్కుల జాబితా వస్తుందని ఆర్ఐవో తెలిపారు. గతంలో ఈ పరీక్షకు హాజరుకాని(2014-15నుంచి గతేడాదివరకు) విద్యార్థులు కూడా పరీక్షను రాసే వెసులుబాటు ఉందని చెప్పారు.

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



లక్ష్మీషాకు స్వాగతం పలుకుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30: జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి.. గృహ నిర్మాణశాఖ ఎండీగా బదిలీ అయ్యారు. మంగళవారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయంలో లక్ష్మీషాకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవోలు రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్యతోపాటు పలువురు అధికారులు స్వాగతం పలికారు. ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాక, కలెక్టర్‌గా లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించనున్నారు.

జాతిపితకు ఘన నివాళి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 30: జాతిపిత గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పలువురు ఘన నివాళి అర్పించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, మల్లారపు రవిప్రసాద్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, జయంత్‌కుమార్, మురళి, మునిమోహన్, చెంగారెడ్డి పుష్పాంజలి ఘటించారు.

మహిళా వర్సిటీలో..



తిరుపతి (విశ్వవిద్యాలయాలు): పద్మావతి మహిళా వర్సిటీలోని గాంధీ విగ్రహానికి వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో..



తిరుపతి(ఆటోనగర్): సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలోనూ గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సదరన్ డిస్కం డైరెక్టర్లు ఎన్‌వీఎస్ సుబ్బరాజు, కె.శివప్రసాద్‌రెడ్డి, సీజీఎంలు జె.రమణాదేవి, వై.లక్ష్మీనరసయ్య, పి.ఆయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, జాయింట్ సెక్రటరీ ఎ.రాధాజయశ్రీ, జీఎంలు ఆదిశేషయ్య, పి.మురళి, రామచంద్రరావు, చంద్రశేఖరరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో కుష్ఠువ్యాధికి చెక్ : డీఎంహెచ్‌వో



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ, జనవరి 30: అవగాహనతో కుష్ఠువ్యాధికి చెక్ పెట్టొచ్చని డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠువ్యాధిపై కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ అరుణసులోచనదేవితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి స్విమ్స్ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. డీపీఎంవో శ్రీనివాస్, వైద్యాధికారులు అశ్విని, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తా

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ అదితి సింగ్



తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారం, సమన్వయంతో తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త కమిషనర్ అదితి సింగ్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖపట్నంలో ట్రైనీ కలెక్టర్‌గా, విజయవాడలో సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన తనకు తిరుపతి పుణ్యక్షేత్రంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తిరుపతి అభివృద్ధి విషయంలో ప్రజలను, ప్రజాప్రతినిధులు, అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతామని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, పరిచయం చేసుకున్నారు. అలాగే డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, ఎస్కే బాబు, నరసింహాచారి, ఆంజనేయులు, ప్రవళ్లిక రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, బాధ్యతలు స్వీకరించే ముందు మేయర్ డాక్టర్ శిరీష నివాసానికి, అనంతరం ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా అదితి సింగ్ కలిశారు.

'సోలార్' ఒప్పందాల్లో వెసులుబాటు కల్పించాలి

టీటీడీ విద్యుత్ విభాగం ఎస్ఈ

తిరుపతి(ఆటోనగర్)జనవరి 30: టీటీడీకి సోలార్ విద్యుత్ సరఫరా ఒప్పందాల్లో వెసులుబాటు కల్పించాలని దేవస్థానం విద్యుత్ విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు కోరారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ రెండో రోజు మంగళవారం తిరుపతి సర్కిల్ కార్యాలయంలో జరిగింది. హాజరైన ఆయన మాట్లాడుతూ.. తిరుమలకు సోలార్ విద్యుత్ 11 కేవీ, 33 కేవీ ఉత్పత్తి వినియోగాలపై గతంలో జరిగిన ఒప్పందాలు 2027 నాటికి పూర్తవుతాయని చెప్పారు. అయితే విద్యుత్ సంస్థ ఈ ఏడాది రూపొందించిన ఒప్పందాల్లో సరఫరా, వినియోగంలో ధరలను సవరిస్తూ టీటీడీకి వెసులుబాటు కల్పించాలని కోరారు. సదరన్ డిస్కం తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈలు వాసుదేవరెడ్డి, వాసురెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఆన్‌లైన్ అభిప్రాయ సేకరణలో పాల్గొన్నారు.

దగ్గర్లోనే గాంధీ కలలుకన్న స్వరాజ్యం: టీడీపీ

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ కలలుకన్న స్వరాజ్యం దగ్గర్లోనే ఉందని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న మహాత్ముడి విగ్రహానికి టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్, సూరా సుధాకర్ రెడ్డి, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, రాజయ్య, ఆనంద్‌గౌడ్, మనోహరాచారి తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రెండు నెలలపాటు ప్రజలు ఓపిక పట్టాలని, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పురోగతి సాధించబోతోందని చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

టీడీపీతోనే మహిళా సాధికారత



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

గూడూరు, జనవరి 30: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక శాంతినగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు పెద్దపీట వేసేలా చంద్రబాబునాయుడు మినీ మెనిఫెస్టోను రూపొందించారన్నారు. మహిళలకు ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి ద్వారా 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో చదవుకునే పల్లలందరికీ ఒక్కొక్కరికీ ఏడాది రూ.15వేల వంతున ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, గోను శివ కుమార్, గురవయ్య, శివ, రవీంద్రరెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శైలజ, సుబ్బమ్మ, శ్రీదేవి, కల్పన, సుధా, లక్ష్మి, రేవతి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: కురుగొండ్ల



సదస్సులో శంఖం ఊదుతున్న కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, జనవరి 30: టీడీపీతో బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, వెంకటగిరి ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం డక్కిలిలో నిర్వహించిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు కూడు, గూడు, గుడ్డ వంటి కనీస అవసరాలు తీర్చేందుకు దివంగత నేత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి కులవృత్తులను ప్రోత్సహిస్తే, చంద్రబాబు నాయుడు బీసీల అభున్నతికి ఎంతగానో కృషిచేశారని చెప్పారు. బడుగు బలహీన వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారిని అన్నివిధాల ఆదుకోవడం జరిగిందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బీసీలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపై నిలబడి తమ సత్తా ఏమిటో జగన్‌కు చూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సదాశివం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మునిస్వామి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు చెలికం భాస్కరరెడ్డి, కుమార్ యాదవ్, పోకూరు రమేష్, పీపీ చౌదరి, శివప్రసాద్, సుభాస్ చంద్రబోస్, పోట్టా మునెయ్య, సుబ్రహ్మణ్యం, డక్కిలి చంద్రారెడ్డి, పెంచలరెడ్డి, పిల్లి శ్రీనివాసులు రెడ్డి, గరిటి చెంచయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తా
బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ అదితి సింగ్



తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారం, సమన్వయంతో తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త కమిషనర్ అదితి సింగ్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖపట్నంలో ట్రైనీ కలెక్టర్‌గా, విజయవాడలో సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన తనకు తిరుపతి పుణ్యక్షేత్రంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తిరుపతి అభివృద్ధి విషయంలో ప్రజలను, ప్రజాప్రతినిధులు, అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతామని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, పరిచయం చేసుకున్నారు. అలాగే డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, ఎస్కే బాబు, నరసింహాచారి, ఆంజనేయులు, ప్రవల్లిక రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, బాధ్యతలు స్వీకరించే ముందు మేయర్ డాక్టర్ శిరీష నివాసానికి, అనంతరం ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా అదితి సింగ్ కలిశారు.

మాధవరం నుంచి తమిళనాడు దక్షిణ నగరాలకు ఆర్టీసీ సర్వీసులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 30: తమిళనాడులోని దక్షిణ నగరాలకు ఇకపై మాధవరం బస్టాండు నుంచి కూడా ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. గతంలో కోయంబేడు బస్టాండుకెళ్లి ప్రయాణికులు బస్సులు ఎక్కాల్సి రావడంతో ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మాధవరం నుంచి కూడా బస్సులు నడిపేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సెంట్రల్ బస్ స్టేషన్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు సూచించారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గూడూరు, జనవరి 30: గూడూరు మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనంతపురం నగరపాలసంస్థ ఉపకమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ నివాసానికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

తక్కువ వడ్డీ రేటుతో వ్యవసాయ రుణాలు

వెంకటగిరిటౌన్, జనవరి 30: రైతులకు తక్కువ వడ్డీ రేటుతో వ్యవసాయ రుణాలు అందిస్తున్నామని ఎన్‌డీసీసీబీ సీఈవో సూరపనేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక బ్యాంకులో రీజనల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 444 రోజుల నగదు డిపాజిట్‌లపై రూ.7.75 వడ్డీ అందిస్తున్నామని, సీనియర్ సిటిజన్లకు 0.50శాతం అదనంగా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజరు సరిత, చంద్రశేఖర్, టీ.రాజా, నిరుపమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్స్ సింగిల్ విండోల సీఈవోలు పాల్గొన్నారు.

ఉద్యోగం చేయలేకపోతే తప్పుకోండి
ఉపాధి కల్పనలో అలసత్వంపై డ్వామా పీడీ మండిపాటు ● రూ.2,57లక్షల రికవరీ, రూ.52,186 జరిమానా



సామాజిక తనిఖీ సభలో నివేదికలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు

ఓజిలి, జనవరి 30: ఉపాధి పనుల కల్పనలో అలసత్వం చూపితే సహించేది లేదని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఓజిలిలో మంగళవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల వారీగా జరిగిన ఉపాధి పనులు, చెల్లింపులు, సిబ్బంది పనితీరును నివేదికల ఆధారంగా పరిశీలించారు. 8.12 కోట్ల రూపాయల వ్యయం చేసి 3.74 లక్షల పనిదినాలను చేపట్టారు. ఈ క్రమంలో జరిగిన పనులపై పంచాయతీల వారీగా నివేదికలను పరిశీలించారు. ఈసీ మెంబర్లు, క్షేత్ర సహాయకుల పనితీరుపై డ్వామా పీడీ మండిపడ్డారు. ఉపాధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పనిచేయించాల్సిన ఏపీవో పనితీరు సరిగాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేయలేకపోతే తప్పుకోవాలని, లేదంటే సస్పెండ్ చేయాల్సివస్తుందని హెచ్చరించారు. కనీసం జాబ్ కార్డులు కూడా ఇవ్వడంలో నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. కార్డులు లేకపోతే తెల్లపేపర్‌లోనైనా పేర్లు నమోదు చేసి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయకపోవడంపై కూడా ఆయన మండిపడ్డారు. జరిగిన పనులకు సంబంధించి కొలతలు కూడా తీసుకోవడం చేతకాని సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారా అంటూ ఆశ్చర్యపడ్డారు. ఎవరూ సక్రమంగా పనిచేయడంలేదని, ఇలాంటి తప్పులు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో జరిగిన వివిధ పనులకు సంబంధించిన అవకతవలపై రూ.2,57,590 రికవరీకి ఆదేశించారు. అదేవిధంగా రూ.52,186 జరిమానా కింద నమోదు చేశారు. రాచపాళెంలో అత్యధికంగా రూ.83,146 రికవరీ ఉండగా, రెండవ స్థానంలో ఇనుగుంట రూ.68,639, మూడవ స్థానంలో భట్లకనుపూరు రూ.23,671) రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ రవికుమార్ నాయుడు, డీఆర్‌డీఏ ఏపీడీ ఉషారాణి, అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, ఎంపీడీవో రజనీకాంత్, ఓజిలి ఏపీవో ఉషారాణి, ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు, వైసీపీ మండల కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి, వైసీపీ నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు
పట్టణంలో వీధిలైట్లు కూడా వెలగడం లేదు ● కౌన్సిలర్ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి, సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ లక్ష్మమ్మ

సూళ్లూరుపేట, జనవరి 30: మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని కౌన్సిలర్లు అన్నారు. పట్టణంలోని గాండ్లవీధిలో ఉన్న స్త్రీ స్వశక్తి భవనంలో మంగళవారం మున్సిపాలిటీ సాధారణ బడ్జెట్ సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పలు అంశాలపై చర్చించి బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 16వ వార్డు కౌన్సిలర్ లక్ష్మమ్మ మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రతి సమావేశంలో తాము అడుగుతున్నామో అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కనీసం వీధి లైట్లు కూడా వెలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ పోలూరు పద్మ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో విద్యుత్ స్తంభాలు మార్చాలని చెప్పినా పట్టించుకోవడంలేదని, విద్యార్థులు తిరిగే స్థలంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇలాగైతే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎన్‌టీ రోడ్డు సమీపంలో వినాయకుడి గుడి వద్ద కల్వర్టు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కల్వర్టును వెంటనే నిర్మించాలని మరో వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ కోరారు. చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరమైన చోట్ల డ్రైన్లు, సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ నరేంద్రకుమార్, మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల

నాయుడుపేట టౌన్, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీని గెలిపించి తప్పుచేశామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని అన్నారు. రా.. కదలిరా... సభలతో చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టి ప్రజలను చైతన్య పరుస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని, వైసీపీ పాలన పట్ల ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవధానం సుధీర్, సుంకర కృష్ణయ్య, వెంపల్లి వెంకటేశ్వర్లు యాదవ్, సుజాతమ్మ, కిష్టయ్య, చక్రపాణి, ముత్యాలయ్య, మొండెం బాబు, ప్రసాద్‌రాజు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



లక్ష్మీషాకు స్వాగతం పలుకుతున్న జేసీ శుభం బన్సల్

రేణిగుంట, జనవరి 30: జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి.. గృహ నిర్మాణశాఖ ఎండీగా బదిలీ అయ్యారు. మంగళవారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయంలో లక్ష్మీషాకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవోలు రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్యతో పాటు పలువురు అధికారులు స్వాగతం పలికారు. ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాక, కలెక్టర్‌గా లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించనున్నారు.

మున్సిపాలిటీ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న పాలకవర్గం

సూళ్లూరుపేట, జనవరి 30: మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్‌ను చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది మంగళవారం సన్మానించారు.

ఎంఈవోకు సత్కారం



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డక్కిలి, జనవరి 30: డక్కిలి ఎంఈవో పిన్నక జగదీష్ బాబును ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంఈవో జగదీష్ బాబు ప్రశంసాపత్రం అందుకున్నారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఎంఈవోను సత్కరించారు. ఎంపీడీవో ప్రసన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.79 కోట్లు

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.79 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది.

వైద్యం అందించలేదంటూ బాధితుల ఆరోపణ

నాయుడుపేట టౌన్, జనవరి 30: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం సక్రమంగా అందించలేదంటూ బాధితులు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. బాధితుల కథనం మేరకు... పట్టణంలోని అమరా గార్డెన్‌లో నివాసం ఉంటున్న అఫ్రాబి అనే మహిళ సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. తరువాత ఆ మహిళ పరిస్థితి బాగాలేదంటూ చెన్నైకు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో అమరా గార్డెన్‌లోని ముస్లింలు ఆస్పత్రి వద్దకు చేరుకొని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆపరేషన్ చేసిన సమయంలో వైద్యం సరిగా అందించకపోవడంతో పరిస్థితి వికటించిందని ఆరోపించారు.

ఉపాధి పనుల్లో జిల్లాకు మొదటిస్థానం

కోట, జనవరి 30: ఉపాది పనుల్లో జిల్లా మొదటిస్థానంలో ఉందని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. కేశవరం పంచాయతీలోని చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం తనిఖీ చేశారు. కూలీలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 35వేల కుటుంబాలకు 1.20కోట్ల పనిదినాలు కల్పించామన్నారు. ఆయనవెంట ఏపీవో పూర్ణిమ, క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

సాదాసీదాగా మండల మీట్

కోట, జనవరి 30: కోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. మండలంలోని మొత్తం 16 మంది ఎంపీటీసీలకు గాను 6మంది మాత్రమే హాజరుకాగా, అందులో ముగ్గురు టీడీపీ వారే. అదేవిధంగా 21 పంచాయతీలుండగా కొత్తపట్నం సర్పంచు తిరుపాలయ్య, చిట్టేడు సర్పంచు రాఘవయ్య మాత్రమే హాజరయ్యారు. టీడీపీ ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, నారాయణ పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. కోట పట్టణం, నెల్లూరుపల్లి కొత్తపాళెంలో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ కోటయ్య, వైస్ ఎంపీపీలు కుప్పల శేషయ్య, వేమారెడ్డి సౌజన్యరెడ్డి, ఎంపీడీవో భవానీ, తహసీల్దారు పద్మావతి, ఎంఈవో మస్తానయ్య, కోఆప్షన్ సభ్యుడు మోబిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు: ఆర్‌ఐవో



మాట్లాడుతున్న ఆర్‌ఐవో ప్రభాకర్‌రెడ్డి, పక్కనే డీఈసీ సభ్యులు

తిరుపతి(విద్య), జనవరి 30: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీజూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్, హైస్కూల్స్ ప్లస్ హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20 తేదీవరకు మూడు స్పెల్స్‌లో, జనరల్ కోర్సులకు అదేనెల 11నుంచి 20వ తేదీవరకు రెండు స్పెల్స్‌లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. 138 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 22,454మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయని చెప్పారు. ప్రత్యేక అధికారి విశ్వనాథ నాయక్, డీఈసీ సభ్యులు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, ఎ.రఘుపతి, తులసీరామిరెడ్డి, వి.బాబు తదితరులు పాల్గొన్నారు.

2న ఎథిక్స్, 3న పర్యావరణ విద్య పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయి. ఈపరీక్షలకు విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఈపరీక్ష పాసైతేనే ఇంటర్ ఉత్తీర్ణులైనట్లు పెద్ద మార్కుల జాబితా వస్తుందని ఆర్‌ఐవో తెలిపారు. గతంలో ఈ పరీక్షకు హాజరుకాని(2014-15నుంచి గతేడాదివరకు) విద్యార్థులు కూడా పరీక్షను రాసే వెసులుబాటు ఉందని చెప్పారు.

సుప్రీంకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 30: లేని ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి జరిగిందని టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం జగన్‌కు చెంపపెట్టు అని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది వరకే చంద్రబాబుకు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తు చేశారు. కనీస ఆధారాలు కూడా లేని కేసు మెరిట్స్ చూసిన న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని తలంటిందని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. అవినీతి, అక్రమాలతో పాటు జగన్ నియంతృత్వ ధోరణితో విసిగి వేసారిన వైసీపీ ఎంపీలు ఒక్కొక్కరూ పార్టీని వీడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. షెడ్యూల్ విడుదలయ్యాక వైసీపీ ఖాళీ కానుందని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికల తరువాత రాష్ట్రంలో వైసీపీ ఉండదని ఆయన తేల్చి చెప్పారు.

నిబంధనలు పాటించి.. ప్రమాదాలను నివారించండి



రహదారి భద్రత పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్

పుత్తూరు అర్బన్, జనవరి 30: రహదారి నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు పరమేశ్వరమంగళం వద్ద ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సుల డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వివరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రతకు పాఠశాల యాజమాన్యాలు సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బస్సుల కండీషన్‌పై ఎప్పటికప్పుడు పరీక్షలు చేయిస్తూ ఉండాలని సూచనలిచ్చారు. అనంతరం భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ కానిస్టేబుల్ ఈ.నరేంద్ర, చైతన్య స్కూల్ ప్రిన్సిపాళ్లు శరవణ, గోపి, వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఆర్టీసీ కార్మికుల నిరసన

పుత్తూరు, జనవరి 30: ఆర్టీసీకి నష్టం కలిగించే చర్యలను వెంటనే ఆపాలని కోరుతూ పుత్తూరు డిపో మెయిన్ గేట్ వద్ద మంగళవారం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. డిపో కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన 1-19 ఉత్తర్వులను అమలు పరచాలని, విశాఖ డీపీటీవో నిరంకుశ వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్, డిపో కార్యదర్శి సుందరం, కేసీ రాయులు, రమేష్, దొరబాబు పాల్గొన్నారు.

అంటరానితనం నేరం



జీహెచ్‌పురంలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

వడమాలపేట, జనవరి 30: అంటరానితనం నేరమని సీఐడీ డీఎస్పీ రసూల్ చెప్పారు. మండంలోని జీహెచ్‌పురంలో మంగళవారం అంటరానితనం నిర్మూలన చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అంటరానితనం నేరమని, కేసు నమోదు చేసి నేరం రుజువైతే రెండు నుంచి ఐదు సంవత్సరాలలోపు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రాజ్‌కుమార్, రామాంజనేయులు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు నయంత్ బాబు, లోకనాధం, గణేష్, మునిబాబు, రాజశేఖర్, నాగరాజు, వెంకటస్వామి, ఉమాపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా..?
మున్సిపల్ సమావేశంలో టీడీపీ సవాల్



కాళాస్త్రి గుంటలో అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాని ఫోటోలను సమావేశంలో ప్రదర్శిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు - సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెబుతున్న చైర్మన్ ఆనంగి హరి

పుత్తూరు అర్బన్, జనవరి 30: 'సార్... మీరు చెప్పే నోటి లెక్కలు...కాకి లెక్కలు మాకు అవసరం లేదు.. 2019వ సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచైనా సరే.... 2021వ సంవత్సరంలో మీ పాలకమండలి కొలువుదీరినప్పటి నుంచైనా సరే.... మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డుల్లో ఏఏ అభివృద్ధి పనులు చేశారు... టెంకాయకొట్టి వదిలేసిన పనులు ఎన్ని, శిలాఫలకం వేసి మరిచిపోయిన పనులు ఎన్ని, టెండర్లు పూర్తైనా ప్రారంభం కాని పనులు ఎన్ని, కాంట్రాక్టర్లు రాక వెనక్కి వెళ్లిపోయిన నిధులు ఎన్ని... వార్డుల వారీగా శ్వేత పత్రం విడుదల చేసే దమ్ము మీకుందా' అని టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గాలి జీవరత్నంనాయుడు సవాల్ విసిరారు. మంగళవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో భాగంగా చైర్మన్ ఆనంగి హరి, ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నంనాయుడు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. కల్యాణపురం వద్ద ఉన్న కాళాస్త్రి గుంటలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లను నిర్మించుకుంటున్నా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఏమి చేస్తున్నారని జీవరత్నంనాయుడు ప్రశ్నించారు. ఇదే గుంటలో ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి మంత్రి రోజా భూమిపూజ చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పునాదుల దశ దాటలేదన్నారు. ఎస్ఎస్ ట్యాంకు కట్ట కుంగిపోయిందని రూ.42 లక్షలు ఖర్చు పెట్టారు. పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకుంది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక పనుల్లో విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికారులు ఎక్కడున్నా చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు. టీడీపీ వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఇది మంచిది కాదన్నారు. టీడీపీ కౌన్సిలర్లు లేవనెత్తిన అంశాలపై చైర్మన్ హరి వివరణ ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పుత్తూరు పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని, సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ఈ ఐదేళ్లలో వెచ్చించిన మొత్తంపై లెక్కలు చెప్పారు. కాళాస్త్రి గుంట అన్యాక్రాంతంపై వారికి ముద్దుకృష్ణమనాయుడు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన 1983లోనే ఇంటిపట్టాలు ఇచ్చారని చెప్పడంతో టీడీపీ కౌన్సిలర్లు అడ్డు తగిలారు. 40 ఏళ్ల క్రితం ఇంటి పట్టాలు ఇస్తే ఇప్పుడు ఇళ్లు నిర్మించుకుంటారా అని ప్రశ్నించారు. చైర్మన్ ఇచ్చే సమాధానం సత్యదూరంగా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్ఎస్ ట్యాంకు పాపం గాలి భానుప్రకాష్‌దేనని చైర్మన్ చెప్పడంతో జీవరత్నంనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు చెప్పేందుకు కూడా ఒక హద్దు ఉంటుందని, ఏ ఆధారాలతో తమ నాయకుడికి అంటగడుతున్నారని నిలదీశారు. ఆధారాలు చూపకుంటే ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి వార్డులోను అభివృద్ధి పనులకు సహకరిస్తున్నామని, ఇంజనీరింగ్ అధికారులు... కౌన్సిలర్ల నుంచి వచ్చే ఏ ప్రతిపాదనైనా పరిశీలించి వెంటనే అనుమతులు ఇవ్వాలని సూచనలిచ్చారు. పుత్తూరులో శ్మశానవాటిక, పాలిటెక్నిక్ కళాశాల, మున్సిపల్ భవనం, పార్కు తదితర అభివృద్ధి పనులు మంత్రి రోజా ఆధ్వర్యంలో జరిగిన విషయాన్ని ప్రతిపక్ష సభ్యులు గమనించాలని హితవు పలికారు. ఇక అధికార పార్టీ కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం విపక్ష పాత్ర పోషించారు. సమావేశంలో అజెండా పూర్తి కాగానే తన వార్డులో నెలకొన్న సమస్యలపై కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించారు.

ఇంధన ఆదాపై ఐఐటీలో శిక్షణ



మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, జనవరి 30: స్టాండర్డ్స్ అండ్ లేబులింగ్ ద్వారా శక్తిని ఆదా చేయవచ్చని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్, సిరి ఎగ్రరీ అండ్ కర్బన్ అడ్వైజరీ సర్వీసెస్ సహకారంతో ఐఐటీలో ప్రమాణాలు మరియు లేబులింగ్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఇంధన వాడకంలో సమర్థవంతమైన పద్ధతుల అవసరాన్ని చెప్పారు. ఏపీఎస్ఈసీఎం ఏఈఈ కె.మధు ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రప్రభుత్వం, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దామోదర్ విద్యుత్ ప్రవాహ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రదర్శించారు. సిరి ఎక్సర్జి డైరెక్టర్ సుబ్రహ్మణ్యం,ఎస్ఈసీఏ అధ్యాపక సభ్యుడు ఎన్. వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజీవనం అస్తవ్యస్తం



ఇంటింటి ప్రచారంలో వినుత

శ్రీకాళహస్తి, జనవరి 30:వైసీపీ పాలనతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిందని జనసేన ఇంచార్జి వినుత అన్నారు. శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి పంచాయతీ పరిధిలో మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.జనసేన నాయకులు రాఘవయ్య, చంద్రబాబు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాస వితరణ

శ్రీకాళహస్తి, జనవరి 30: ముక్కంటి ఆలయ గోశాలకు తిరుపతికి చెందిన రాజగోపాల్ రెండు ట్రాక్టర్ల పశుగ్రాసం వితరణ చేశారు.గోశాల ఇంచార్జి సురేష్ రెడ్డికి అందజేశారు.

ఏడు గంగమ్మల ఆలయంలో నేడు బాలాలయ పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 30: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న పట్టణంలోని ఏడు గంగమ్మల ఆలయంలో బుధవారం నుంచి బాలాలయ పూజలు జరుగుతాయని అధికారులు తెలిపారు. గురువారం ఉదయం వేదోక్తంగా బాలాలయ స్థాపన నిర్వహిస్తామన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



స్వర్ణ కవచ అలంకారంలో దక్షిణ కాళికాదేవి

శ్రీకాళహస్తి, జనవరి 30: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మధ్యాహ్నం రాహుకాల సమయంలో అర్చకులు మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు.నిమ్మకాయలు, పూలమాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు.

కాలభైరవ స్వామికి ప్రాకార ఉత్సవం



శ్రీకాళహస్తి, జనవరి 30: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం మీదుగా విజయ స్థూపం వరకు తీసుకువెళ్ళి ప్రదక్షిణగా తిరిగి ఆలయంలోకి తీసుకొచ్చారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

కేవీబీపురం, జనవరి 30 : మండలంలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీ గురుమూర్తి చెప్పారు. మంగళవారం కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో, సర్పంచులతో, ఎంపీటీసీలతో ఆయన సమావేశమయ్యారు.ఆరె కోనలో మరణాల విషయం, వేమలపూడి, కళత్తూరు, ఆదవరం, దిగువపుత్తూరు గ్రామాల్లో అటవీ భూముల సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచులు, ఎంపీటీసీలు చెప్పారు.ఆడుదాం ఆంధ్ర పోటీల్లో కబడ్డీలో గెలుపొందిన కేజీబీవీ బాలికలకు, క్రికెట్‌లో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు.జడ్పీటీసీ మున్నెమ్మ,తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో రామచంద్ర,వైసీపీ నాయకులు కృష్ణయ్య, ధనంజయ రెడ్డి, మాధవి రెడ్డి, నందకుమార్, లాల్‌బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలం దిష్టిబొమ్మలను తగులబెట్టిన వైసీపీ శ్రేణులు

పిచ్చాటూరు/బుచ్చినాయుడుకండ్రిగ/కేవీబీపురం, జనవరి 30 : వైసీపీ అధిష్ఠానాన్ని ధిక్కరించి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తిరుగుబాటు చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పట్ల ఆ పార్టీ శ్రేణులు అమానుషంగా వ్యవహరించాయి. మంగళవారం సత్యవేడు నియోజకవర్గవ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను, చిత్రపటాలను తగులబెట్టాయి. పిచ్చాటూరులో ఆదిమూలం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హైదరాబాదులో టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే, ఆయన తనయుడు కలవడం పట్ల వైసీపీ శ్రేణులు ఆగ్రహించాయి. వైసీపీ కార్యాలయం వద్ద, అలాగే జాతీయ రహదారిపైన వేర్వేరుగా ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను తగులబెట్టారు. కేవీబీపురం, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగల్లోనూ ఆయన దిష్టిబొమ్మలను తగులబెట్టారు. దళిత ఎమ్మెల్యే పట్ల అధికార పార్టీ శ్రేణులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది.

పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేసే స్థాయి లేదు : వైసీపీ

పిచ్చాటూరు / వరదయ్యపాళెం, జనవరి 30: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఆరోపణలు చేసే స్థాయి లేదని పిచ్చాటూరు వైసీపీ మాజీ కన్వీనర్, విండో చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి పేర్కొన్నారు.అధికారంలో ఆస్తులు పోగేసుకుని ఇతరులపై అభాండాలు వేయడం ధర్మం కాదన్నారు. వరదయ్యపాళెంలో వైసీపీ నాయకులు నాయుడు దయాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ జ్యోతి, తిలక్ బాబు, కవిత తదితరులు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డిపై మాట తూలితే సహించమన్నారు.

బాల్యం అమూల్యం

శ్రీకాళహస్తి, జనవరి 30: ప్రతి ఒక్కరికీ బాల్యం ఎంతో అమూల్యమైందని న్యాయవాది రాజేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని భరద్వాజ గిరిజన కాలనీలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలతో మాట్లాడుతూ...విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని తెలిపారు.న్యాయవాది రమేష్ బాబు, యాసీన్,వాసు, లీగల్ ఎయిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయం

శ్రీకాళహస్తి, జనవరి 30: మాతా శిశు సంరక్షణే ధ్యేయమని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని బీవీపురం పంచాయతీలో మంగళవారం మహిళలకు, విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్గించారు.

1,090 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

ఏర్పేడు, జనవరి 30: ఏర్పేడు మండలం చింతలపాళెం టోల్‌ప్లాజా సమీపంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ ఆటోను ఎస్ఐ జిలానీ దాడి చేసి పట్టుకున్నారు. ఆటోలో తరలిస్తున్న 1,090 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నారు.బియ్యం అక్రమంగా తరలిస్తున్న వెంకటగిరి మండలానికి చెందిన హరి, వరప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 30: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు.భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గాంధీజీ బాట అనుసరణీయం





గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బత్తెయ్య నాయుడు - సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత

శ్రీకాళహస్తి, జనవరి 30: మహాత్మా గాంధీ చూపిన బాట అనుసరణీయమని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు.గాంధీ వర్ధంతిని పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం భక్త కన్నప్ప వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.గిరి ప్రసాద్ గౌడ్, బాల,బత్తయ్య, సిద్ధులయ్య, పవన్, దేవేంద్ర,మధు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తయ్య నాయుడు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు గోపి,వెంకటముని, టీవీ శేఖర్, వీర రాఘవరెడ్డి, నాగూర్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీలత గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గాంధీ జీవన విధానాన్ని వివరించారు.అధ్యాపకులు నాగయ్య, సుధీర్, గంగారం, మునయ్య, రాజేంద్రుడు, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమిలో మట్టి తవ్వకాలు



శ్మశాన భూమిలో మట్టి తీయడంతో ఏర్పడిన గుంతలు

బుచ్చినాయడుకండ్రిగ, జనవరి 30: మండలంలోని గాజులపెళ్ళూరు శ్మశాన భూమిలో మట్టి తవ్వకాలను దళితులు మంగళవారం అడ్డుకున్నారు. గ్రామంలో కొందరు మట్టిని తరలించి సొమ్ములు చేసుకుంటున్నారని దళితులు తెలిపారు.అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని తెలిపారు. శ్మశాన భూమిలో మట్టిని తరలించడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో మృతదేహాలను పూడ్చడం చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు.అధికారులు స్పందించి శ్మశాన భూమిలో మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, జనవరి 30: ముక్కంటి ఆలయాన్ని మంగళవారం గన్నవరం టీడీపీ ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు, చిత్తూరు టీడీపీ నాయకులు జగన్మోహన్ దర్శించుకున్నారు.సహస్ర లింగం వద్ద రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు.ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి సుధీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ముక్కంటిని దర్శించుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ దర్శన ఏర్పాట్లు చేశారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నియంత్రణ

శ్రీకాళహస్తి, జనవరి 30: అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమని శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి దామోదర నాయుడు అన్నారు. పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో మంగళవారం విద్యాసంస్థల వాహనాల డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ పిల్లలు బస్సు ఎక్కడం, దిగడం జరిగే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని,బస్సు డోర్లు పూర్తిగా లాక్ అయ్యేలా చూసుకోవాలన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ పద్మలత

ఏర్పేడు, జనవరి 30: ఏర్పేడులో మంగళవారం తిరుపతి సీఐడీ ఆర్వో డీఎస్పీ పద్మలత ఎస్సీ, ఎస్టీ యాక్ట్-1989పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలపై అరాచకాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులపై తక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్ఐ జిలాని, చంద్రశేఖర్, సురేష్, మురగయ్య, ఉదయ్‌కుమార్‌రెడ్డి, మంజుల, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత భారత్‌కు కృషి చేద్దాం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, జనవరి 30: అవినీతి రహిత దేశం కోసం కృషి చేద్దామని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ సంయుక్త కార్యదర్శి త్యాగరాజు అన్నారు. మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో అవినీతి రమిత భారతదేశం అనే అంశంపై విద్యార్థులకు సీసీఆర్ ఆధ్వర్యంలో జనవరి 4న వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ పోటీలు గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. బాలికల విభాగంలో దేవకి, రోజారమణి, యోగేశ్వరి, బాలుర విభాగంలో అస్లాం,కృష్ణ చేతన్, డిల్లీబాబు ప్రథమ, ద్వితీయ, స్థానాలు సాధించారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత భారతదేశంగా తయారయ్యేందుకు యువత, భావి భారత పౌరుల కృషి ఎంతో అవసరమన్నారు. ఆ దిశగా అడుగులు వేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలియేజర్ పళ్లిపట్టు, శివకుమార్; ఉదయ్‌కుమార్, లోకేష్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు చెప్పడమే తప్ప పరిష్కారం ఎక్కడ?

● మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వరదయ్యపాళెం, జనవరి 30: ప్రతి సమావేశంలో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడమే తప్ప ఇప్పటివరకు పరిష్కరించిన పాపాన పోలేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరానగర్ సర్పంచ్ వీరభద్రం మాట్లాడుతూ తమ పంచాయతీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, అప్పటికే అమర్చిన స్తంభాలకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని రెండేళ్ల కిందట ఎమ్మెల్యే ఆదేశించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో రెండేళ్లుగా విద్యుత్ సమస్యలపై పలు వినతులు ఇస్తూనే ఉన్నా పరిష్కరించిన దాఖలాలు లేని పలువురు ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ వీరాస్వామి మాట్లాడుతూ తమ పంచాయతీలో వీధిదీపాలు వెలగడంలేదని, రాత్రి వేళల్లో పాముల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని రెండేళ్లుగా విన్నవిస్తున్నా చర్యలు లేవన్నారు.తాగునీటి కొరత నేపథ్యంలో అదనపు బోరు వేయాలని రెండేళ్లుగా ప్రాధేయపడుతున్నా చర్యలు శూన్యమన్నారు. బోరు మంజూరయినా సర్పంచ్, ఎంపీటీసీ మధ్య నెలకొన్న విబేధాల కారణంగా పరిష్కరించలేకపోయామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవిక అన్నారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం రాజు, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ హరిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు సిద్ధిక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, మార్కెటింగ్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.మండలంలో 29 పంచాయతీలకు ఐదుగురు సర్పంచులు మాత్రమే హాజరు కాగా 13మంది ఎంపీటీలకు ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. పలువురు అధికారులు సైతం గైర్హాజరు కావంతో ఖాళీ కుర్చీలతో సమావేశం బోసిపోయింది.

పొలం వద్ద ఘర్షణపై కేసు నమోదు



గాయపడ్డ బాలాజి

నాగలాపురం, జనవరి 30: పొలంలో ఇసుక తోడివేతపై జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన నాగలాపురం మండలంలో చోటు చేసుకుంది.బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. చిన్నాపట్టు గ్రామానికి చెందిన వలంటీర్ బాలాజి మంగళవారం అరుణానదిని ఆనుకుని ఉన్న తన పొలానికి సమీపంలో అదే గ్రామానికి చెందిన బుజ్జి ఇసుకను తోడి ఎడ్ల బండికి వేస్తుండడం గమనించాడు.పొలానికి సమీపంలో ఇసుక తవ్వడంవల్ల పంటలు దెబ్బతింటాయని బుజ్జీని నిలదీయడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. బుజ్జీ వెంటనే గ్రామానికే చెందిన టీడీపీ కార్యకర్త సుధాకర్(ధన) అనే వ్యక్తిని ఫోన్ చేసి పిలిపించడంతో ఘర్షణ తీవ్రస్థాయికి చేరుకుంది. సుధాకర్ ఇసుకను తవ్వుతున్న ఇనుప పారతో బాలాజీ మెడపై దాడి చేశాడు.తీవ్రంగా రక్తస్రావం కావడంతో బాలాజీని కుటుంబ సభ్యులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం బాలాజీ తనపై దాడికి పాల్పడ్డ బుజ్జీ, సుధాకర్ తదితరులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎస్ఐ ఓబయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్యకర్తలే టీడీపీ ప్రాణం



మాట్లాడుతున్న సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 30: టీడీపీకి కార్యకర్తలే ప్రాణమని పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు.వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్, బూత్ ఇంచార్జిలతో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఓటరు జాబితాను క్షుణ్ణంగా జల్లెడ పట్టాలని సూచించారు. భవిష్యత్తుకు గ్యారంటీ పథకాన్ని సాంకేతికంగా ఎలా నమోదు చేయాలో టీడీపీ సోషల్ మీడియా నిపుణులు వివరించారు.పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మాధవరం నుంచి తమిళనాడు దక్షిణ నగరాలకు ఆర్టీసీ సర్వీసులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 30: తమిళనాడులోని దక్షిణ నగరాలకు ఇకపై మాధవరం బస్టాండు నుంచి కూడా ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. గతంలో కోయంబేడు బస్టాండుకెళ్లి ప్రయాణికులు బస్సులు ఎక్కాల్సి రావడంతో ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మాధవరం నుంచి కూడా బస్సులు నడిపేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు సూచించారు.

16న తిరుమలలో రథసప్తమి వేడుక

ఒకే రోజు ఏడు వాహనాలపై దర్శనమివ్వనున్న శ్రీవారు

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా ఫిబ్రవరి 16వ తేదీన తిరుమలలో రథసప్తమి పర్వదినం జరగనుంది. ఈ సందర్భంగా ఏడు వాహనాలపై శ్రీవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. పవిత్రమైన మాఘ మాసంలో శుక్ల పక్ష సప్తమి తిథిని రథసప్తమి లేదా మాఘ సప్తమి అని పిలుస్తారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార, ఊంజల్ సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనున్నారు.

పది మద్యం బాటిళ్లు పట్టివేత

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 30: మండలంలోని పదవమైలు దగ్గర పది మద్యం బాటిళ్లను తీసుకుపోతున్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

ఎస్ఐకి సన్మానం

వరదయ్యపాళెం, జనవరి 30: వరదయ్యపాళెం ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్‌ను మంగళవారం ఆటో యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు.

గాంధీజీకి ఘననివాళి

రేణిగుంట, జనవరి 30 : రేణిగుంటలోని పాంచాలి నగర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ,మండల కన్వీనర్ కుప్పుస్వామి ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, గీత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బషీర్ సేవలు చిరస్మరణీయం



దిల్షార్ బేగానికి సన్మానం

రేణిగుంట, జనవరి 30 : రేణిగుంటలో ఐదు దశాబ్దాల పాటు విశేష సేవలందించిన డాక్టర్ బషీర్ సేవలు చిరస్మరణీయమని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.జనార్దన్ కొనియాడారు. మంగళవారం డాక్టర్ బషీర్ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బజారు వీధిలోని ప్రజావైద్యశాలలో ఆయన సతీమణి దిల్షార్ బేగంను సత్కరించారు.సర్పంచ్ ఆర్.నగేశం,జూలియస్ రాజు, అసన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

2న జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30: ఎస్వీయూలో ఫిబ్రవరి 2వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో మేళా ఆరంభం కానుంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు అర్హులు. సమగ్ర వివరాలకు 7989810194 నెంబరులో సంప్రదించాలని వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ డాక్టర్ వీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

మద్యం కేసులో ఒకరి అరెస్టు

తొట్టంబేడు, జనవరి 30:అక్రమంగా 20 మద్యం బాటిళ్లను తరలిస్తున్న బోనుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన వేణుగోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

ఇంట్లో మద్యం వుంచుకోవడంపై కేసు

ఏర్పేడు, జనవరి 30: ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామంలో మద్యం అమ్ముతుండగా చెంగారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జిలాని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

తొట్టంబేడు, జనవరి 30: తొట్టంబేడు పంచాయతీ సచివాలయం2లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికల వేళా...పాత ఎస్ఐలేనా?



ఎస్ఐలు వీరాంజనేయులు, ప్రతాప్

సత్యవేడు, జనవవరి 30: ఎన్నికలు సమీపిస్తున్న వేళ సత్యవేడు నియోజకవర్గంలో పని చేసి బదిలీపై వెళ్ళిన కొందరు పోలీసు అధికారులకు మళ్ళీ ఇక్కడే పోస్టింగులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. సత్యవేడు ఎస్ఐగా వీరాంజనేయులు, వరదయ్యపాళెం ఎస్ఐగా ప్రతాప్ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే . వీరిద్దరూ ట్రైనీ ఎస్ఐలుగా సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు.2021లో వీరాంజనేయులు, ప్రతాప్ ట్రైనీ ఎస్ఐలుగా ఒకేసారి చేరి బదిలీ అయ్యారు. ప్రతాప్ 2022 వరకు సత్యవేడులోనే విధులు నిర్వహించి బదిలీపై వెళ్లి నాగలాపురం, కేవీబీపురం స్టేషన్లలో పని చేశారు. వీరాంజనేయులు గత ఏడాది వరకు ట్రైనీ ఎస్ఐగా,ఎస్ఐగా బాధ్యతలు చేపట్టి బదిలీపై కడప జిల్లాకు వెళ్ళారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల దృష్ట్యా పోలీసు అధికారులను బదిలీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడే ట్రైనీ ఎస్ఐలుగా బాధ్యతలు నిర్వహించి, బదిలీపై వెళ్ళిన వీరాంజనేయులుకు మళ్ళీ సత్యవేడు ఎస్ఐగా, ప్రతాప్‌కు వరదయ్యపాళెం ఎస్ఐగా పోస్టింగు ఇవ్వడం చర్చకు దారి తీసింది.అలాగే శ్రీసిటీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జగదీష్ నాయక్ ఎప్పుడో ఎనిమిదేళ్ళ క్రితం ఇక్కడకు సీఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడే విధులు నిర్వహించి, ఇక్కడే పదోన్నతి పొంది డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల వేళ ఆయనను ప్రభుత్వం బదిలీ చేస్తుందా లేక ఇక్కడే ఉంచుతారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్యాన్సర్ నివారణలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

బీఐవో ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

తిరుపతి సిటీ, జనవరి 30: క్యాన్సర్ నివారణలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(బీఐవో) ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్విమ్స్‌లోని పద్మావతి ఆడిటోరియంలో బీఐవో, కమ్యూనిటీ మెడిసిన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ)లకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ రోగులను తొలిదశలోనే గుర్తించే బాధ్యతలను ఎంఎల్‌హెచ్‌పీలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ.. శిక్షణకు జిల్లా నుంచి 90 మంది మెడికల్ ఆఫీసర్లు, 440 మంది సీహెచ్‌వోలు, 25 మంది ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొంటారని తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, డీపీఎంవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణ సులోచనదేవి, డీఎస్‌వో తేజస్విని తదితరులు పాల్గొన్నారు.